క్లుప్తంగా

ప్రతి రైతుకు అగ్రిస్టాక్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కృత్తివెన్ను: ప్రభుత్వం నుంచి రైతులకు లభించే అన్ని పథకాలు, తుఫానులు, విపత్తుల సమయంలో రావాల్సిన సాయం రైతుకు దక్కాలంటే తప్పనిసరిగా ప్రతి రైతు అగ్రిస్టాక్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి ఎస్. జెస్సీ సూచించారు. దీనిపై ఆదివారం ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ (ఏపీఎఫ్ఆర్) పోర్టల్‌లో అన్ని రైతుసేవా కేంద్రాల్లో ఈ నమోదు ప్రక్రియ జరుగుతోందన్నారు. ముందుగా పీఎం కిసాన్ లబ్ధిదారుల నమోదు జరుగుతుందని, రైతులందరూ దీనిలో నమోదు కావాలన్నారు. అగ్రికల్చరల్‌తో పాటు ఫిష్ కల్చర్ చేసే రైతులు సైతం ఐడీ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు.

80మందికి కంటి వైద్య పరీక్షలు



నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి(పెదకాకాని) సహకారంతో పారిశ్రామికవేత్త బొబ్బా గోవర్ధన్ ఆర్థిక సౌజన్యంతో సుదర్శి మానవత సేవాసంస్థ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక మారుతీ విద్యానికేతన్ డిజిటల్ స్కూలు ప్రాంగణంలో జరిగిన శిబిరంలో 80 మందికి కంటి పరీక్షలు చేశారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభి శిబిరాన్ని సందర్శించి సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకట నారాయణలను అభినందించారు. మండవ బాలవర్ధిరావు, ఆసుపత్రి క్యాంప్ ఇన్‌చార్జి గంగాధర్, వర్రే రాంబాబు, మత్తి శివ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి శివారు గంజివానిపాలెం దళితవాడలో చల్లపల్లి గ్రేస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ నందిగం మేరీ రాణి, వార్డు సభ్యురాలు భారతి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పన్నులు చెల్లించకుంటే విద్యుత్ కనెక్షన్‌ల తొలగింపు

ఎంఎంసీ కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థకు ప్రజలు చెల్లించాల్సిన ఆస్తి, తాగునీటి పన్నులను చెల్లించకుంటే వారి గృహాలకు ఉన్న విద్యుత్ కనెక్షన్‌లను తొలగించడం జరుగుతుందని ఎంఎంసీ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎంసీ కార్యాలయంలోని పన్నులు కట్టించుకునే కౌంటర్ల పని వేళల సమయాలను పెంచడం జరిగిందన్నారు. ప్రతిరోజూ ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఎనిమిది గంటల వరకు కౌంటర్లు పని చేస్తాయని తెలిపారు. అలాగే ప్రధాన పండుగ దినాల్లో మినహా మిగిలిన సెలవు రోజుల్లో కూడా కౌంటర్లు పని చేస్తాయన్నారు. ఆదివారాలు, రెండో శనివారాల్లో కూడా కౌంటర్లలో పన్నులు చెల్లించవచ్చునని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైభవంగా దివ్య కల్యాణోత్సవం



మోపిదేవి: స్థానిక శ్రీగంగా పార్వతీ సమేత సకలేశ్వరస్వామివారి దివ్య కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వేదమంత్రోచ్చరణలతో రాత్రి వైభవంగా కల్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా పడిన కంటైనర్



బంటుమిల్లి: మండలంలోని ముంజులూరు గ్రామం వద్ద 216వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి రొయ్య పిల్లల కంటైనర్ అదుపుతప్పి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. వివరాల్లోకి వెళితే.. పాండిచ్చేరి రాష్ట్రం నుంచి వనామీ రొయ్యపిల్లల లోడుతో కంటైనర్ పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణానికి బయలుదేరింది. ముంజులూరు గ్రామం వద్దకు రాగా వాహనం అదుపుతప్పి డివైడర్ పైకెక్కి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఆదివారం పోలీసులు సమాచారం తెలుసుకుని ఘటనా స్థలానికి వెళ్లి కంటైనర్ తొలగించారు. ఈ ఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని ఎస్ఐ గణేష్ కుమార్ తెలిపారు.

పెట్టుబడి ఖర్చులైనా వచ్చేనా.!

- ఆందోళనలో మినుము రైతులు
- నగానికి పడిపోయిన దిగుబడులు



కృత్తివెన్ను మండలం యండపల్లి వద్ద ఆశాజనకంగా లేని మినుము పంట



ఇప్పటికీ పురుగు మందులు కొడుతున్న రైతు

కృత్తివెన్ను: రెండవ పంటగా అపరాల సాగులో భాగంగా మినుము పంట వేసిన రైతులకు ఈ ఏడాది గడ్డుకాలమే కనిపిస్తోంది. పంట ఆశించిన స్థాయిలో లేకపోగా కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. పెడన నియోజకవర్గంలోని కృత్తివెన్ను మండలంలో 1,213, పెడనలో 16,175, గూడూరులో 15,301, బంటుమిల్లిలో 9,157 ఎకరాల్లో ఈ రబీలో రెండవ పంటగా రైతులు మినుమును సాగు చేశారు. గతేడాది ఎకరానికి గరిష్టంగా ఏడు క్వింటాళ్లకు పైగా దిగుబడి రాగా ఈ ఏడాది కనీసం మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నాన్చివేత ధోరణితో సగం చేటు

పుష్కలంగా వర్షాలు కురవడంతో ప్రాజెక్టులన్నీ నీటితో నిండాయని ఈ ఏడాది రబీ సాగుకుగానూ వరికి నీరిస్తారన్న ఆశతో రైతులు ఎదురుచూశారు. కానీ ప్రభుత్వం చివరి వరకు ఇదిగో–అదిగో అంటూ కాలయాపన చేయడంతో రైతులు ఒకింత గందరగోళానికి గురయ్యారు. తీరా చూస్తే చివరి నిమిషంలో దాళ్వాకు క్రాప్ హాలిడే అంటూ అధికారులు ప్రకటన చేయడంతో అప్పటికప్పుడు రైతులు మినుము సాగువైపు కదిలారు. అదే సమయంలో తుఫాను రావడంతో కొంత ఆలస్యం అయింది. తీరా చూస్తే అదును దాటిపోయింది. అది కూడా దిగుబడులపై తీవ్ర ప్రభావాన్ని చూపినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కావాల్సిన విత్తనాలివ్వలేదు

సాధారణంగా రైతులు ఎక్కువగా తమ భూములకు అనుకూలమైన విత్తనాలను చల్లుకుంటారు. కానీ ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనాలు కాకుండా ఎల్‌బీజీ–752, వీబీఎన్–8, పీయూ–31 రకాలు తక్కువ శాతం సబ్సిడీతో అరకొరగా అందజేసింది. కానీ రైతులు అధికశాతం మంది నిందినీ వెరైటీలను, నూతన వంగడాలను అధిక ధరలు చెల్లించి ప్రైవేటుగా కొనుగోలు చేశారు.

ఆర్బీకేలు నిర్వీర్యం

గత ప్రభుత్వ హయాంలో ఆర్బీకేల ద్వారా రైతులకు కావాల్సిన సమాచారం, అవసరమైన పనిముట్లు అందించేవారు. ప్రస్తుతం ఆర్బీకేలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేయడంతో రైతులకు కావాల్సిన వ్యవసాయ యాంత్రిక పనిముట్లు అనేవి లేకుండా పోయాయి. గతంలో కస్టమ్ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ) పేరుతో గ్రూపుల ద్వారా ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై ఇచ్చేవారు. ప్రస్తుతం అటువంటివేమీ లేవు.

ప్రభుత్వం చేతులెత్తేసింది



దాళ్వాకు నీరిస్తామంటూ ఇదిగోఅదిగో అంటూ ప్రభుత్వం సాగదీసింది. తీరా చూస్తే నీరివ్వలేమంటూ చేతులెత్తేసింది. అప్పటికే పదును దాటిపోయింది. ప్రభుత్వం కనీసం రైతులకు కావాల్సిన వంగడాలను కూడా అందించలేకపోయింది. ఎలుకల నిర్మూలన కోసమే ఎకరానికి రూ. 5 వేలు వరకూ ఖర్చు చేశాం.

–పిన్నెంటి బాబ్జీ, రైతు, యండపల్లి

ఖర్చులు కూడా రావు



నేను 20 ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. గతేడాది ఎకరానికి ఏడు క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చింది. ఈ ఏడాది కనీసం మూడు క్వింటాళ్ల కూడా వచ్చే పరిస్థితి లేదు. ఎకరానికి రూ. 30 వేలకు పైగా ఖర్చు చేశాను. అదునులో వేసుంటే పరిస్థితి మరోలా ఉండేదేమో.

–శ్యామకూరి రాంబాబు, కౌలురైతు, గాంధీనగరం

కనులపండువగా అచలేశ్వరస్వామి ప్రతిష్ట



ప్రాణప్రతిష్ట అనంతరం దర్పణ దర్శనం, మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న రుత్వికులు



చల్లపల్లి రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భక్తులు

పాగోలు(చల్లపల్లి): చల్లపల్లి మండలం పాగోలులో శ్రీకమలాత్మికా సహిత అచలేశ్వర పంచాయతన ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం కనులపండువగా జరిగింది. కైవల్యాశ్రమ చలాచల బోధోపదేశ మందిర ప్రాంగణంలో ఈనెల 17వ తేదీ నుంచి ప్రతిరోజూ ప్రతిష్ఠా మహోత్సవాలు జరుగుతున్నాయి. అచలేశ్వరునితోపాటు సాక్షి గణపతి, దత్తాత్రేయ, వ్యాస, శ్రీకృష్ణ, జగద్గురు ఆదిశంకర సహిత పరివార దేవతా సహిత పంచముఖ ఆంజనేయ, గరుత్మంతాది క్షేత్రపాలకులను కూడా ప్రతిష్ఠించారు. చివరిగా శాంతి కల్యాణం జరిగింది. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

చల్లపల్లి: చల్లపల్లి పడమరవీధిలోని శ్రీరాఘవపు రపు వెంకటకృష్ణమ్మ జానకీ రామాలయంలో నిర్వహించిన శ్రీసీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్ర స్వామివారి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం కనులపండువగా జరిగాయి. యంత్రప్రతిష్ఠ అనంతరం విగ్రహ మూర్తులను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. అనంతరం పూర్ణాహుతి, కుంభాభిషేకాలు నిర్వహించారు. ఐదు వేల మందికి పైగా భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



మచిలీపట్నంటౌన్: స్థానిక చిలకలపూడిలో వేంచేసి ఉన్న శ్రీమానస పుత్రి నాగకన్య నాగేంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ వేమూరి శ్రీనివాసశర్మ చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ నిర్వాహకులు బెల్లంకొండ శివకేశవులు – శిరీష, బొమ్మిడి పాండురంగారావు – సుజాత, నవకాంత్ దంపతులు, భక్త కమిటీ ప్రతినిధులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సాగరతీరంలో మెరైన్ గస్తీ



కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు ఆదివారం ప్రత్యేక గస్తీ నిర్వహించారు. సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు తీరానికి తరలివచ్చారు. వారందరికీ మెరైన్ పోలీసులు జాగ్రత్తలు చెబుతూ అప్రమత్తం చేశారు. సముద్రంలో లోతుకు వెళ్లి స్నానాలు ఆచరించరాదంటూ లౌడ్ స్పీకర్లతో అవగాహన కల్పించారు. తుఫాన్లు, అల్పపీడనాల కారణంగా సముద్రంలో గుంతలు ఏర్పడ్డాయని, పర్యాటకులు అప్రమత్తం ఉండాలని మెరైన్ ఎస్ఐ పూర్ణ మాధురి కోరారు. మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రికి శివాలయాలు ముస్తాబు

రేపటి నుంచి శ్రీసంగమేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన సంగమేశ్వరస్వామి ఆలయం

సంగమేశ్వరం(నాగాయలంక): మండలంలో ప్రసిద్ధి చెందిన పురాతన శ్రీగంగా పార్వతీ సమేత సంగమేశ్వరస్వామివారి మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. దేవదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ఈఓ సీహెచ్ సుధాకర రావు, అర్చకస్వామి కొల్లిపర శివసాయి తిరుమల భార్గవ్ తెలిపారు. 25న అయ్యవారు, అమ్మవార్లను పెళ్లికి ముస్తాబు, పుణ్యాహ వచనం, అంకురారోపణ, వాస్తుపూజ, ధ్వజారోహణ, యాగశాల ప్రవేశం, బలిహరణ, రాత్రికి సత్యహరిశ్చంద్ర జానపద నాటక ప్రదర్శన, 26న ఉదయం స్వామి వారికి అభిషేకాలు, నాత్యోపాసన, రాత్రికి జగజ్యోతి, వధూవర అన్వేషణ(ఎదుర్కోలు ఉత్సవం), దివ్య కల్యాణం, శ్రీమద్విరాట్ పంచరత్నాలు నాటక ప్రదర్శన, 108కేజీల విభూదితో అభిషేకం జరుగుతాయి. 27న రథోత్సవం, రాత్రికి విప్లవ సాంఘిక నాటకం, 28న స్వామివారి వసంతోత్సవం, సముద్ర విహారం, ఊరేగింపు, పూర్ణాహుతి, ధ్వజ అవరోహణ జరుగుతాయి.

నాగాయలంకలో..

గ్రామంలోని ప్రసిద్ధి చెందిన శ్రీపార్వతీ సమేత కన్యకా పరమేశ్వరి సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు తెలిపారు. అలాగే స్థానిక కృష్ణానది తీరం శ్రీరామ పాదక్షేత్రం పుష్కర ఘాట్‌లోని శ్రీరామలింగేశ్వరస్వామి మండపంలో మహాశివ రాత్రి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు తెలిపారు.

నాగపుట్టలో పాలు పోస్తున్న భక్తులు



కార్తికేయుని సన్నిధిలో భక్తుల రద్దీ



ఆలయంలో భక్తులు

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. తెల్లవారుజాము నుంచే రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన వేలాది మంది భక్తులతో క్యూలైన్లన్నీ నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థుల భవిష్యత్తుకు 10వ తరగతి పునాది



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

బంటుమిల్లి: ప్రతి విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకోవడానికి 10వ తరగతి ఒక పునాది లాంటిదని పాఠశాల డైరెక్టరు కే కిషోర్ అన్నారు. స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ మార్చి 17 నుంచి ప్రారంభం కానున్న 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కుల సాధనకు తీసుకోవలసిన జాగ్రత్తలు, చేయవలసిన కృషిపై అవగాహన కలిగించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తొలుత డైరెక్టరు కిషోర్, కరస్పాండెంట్ శోభ ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి కేట్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీదుర్గా నాగేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లి శ్రీదుర్గా నాగేశ్వరస్వామివార్ల వార్షిక బ్రహ్మోత్సవాలను ఆదివారం ప్రాంభించారు. ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవదాయ శాఖ తరపున ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉదయం 10.30 గంటలకు శ్రీస్వామివారిని పెండ్లి కుమారునిగా అలంకరించారు. సాయంత్రం ఆరు గంటలకు యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, అంకురారోపణ, రక్షాబంధన, దీక్షా వస్త్రధారణ, నవగ్రహ మండపారాధన, వాస్తు హోమం, పర్యగ్నికరణ, ధ్వజారోహణ, నంది ముద్దలు, బలిహరణ నిర్వహించారు. అనంతరం రాత్రి 10 గంటలకు రాజాధిరాజ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. గ్రామ సర్పంచ్ అరజా సంధ్యారాణి, కడవకొల్లు సీతారామాంజనేయులు, అరజా వెంకటేశ్వరరావు, గొర్రెపాటి దుర్గా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ పరిశీలన



నాగాయలంకలో కూరగాయల వ్యాపారికి కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీఓ

నాగాయలంక: మండలంలోని అన్ని గ్రామాల్లో చేపట్టిన స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను ఆదివారం డీఎల్‌పీఓ సీతారామయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా తడి – పొడి చెత్త సేకరణ, పారిశుద్ధ్య అంశాలపై ప్రజలు, చిరు వ్యాపారులకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కలిగించారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయంలో మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు, డిజిటల్, ఇంజినీరింగ్ సహాయకులకు డీఎల్‌పీఓ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ, స్థానిక గ్రామ కార్యదర్శి పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక డ్రైవ్

ఘంటసాల: ఘంటసాల పంచాయతీ పరిధిలో పరిసరాల పరిశుభ్రతపై ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, రహదారులకు ఇరువైపుల ఉన్న చెత్త కుప్పలను, పరిసరాలను పరిశుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. అనంతరం తడి – పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించి గ్రీన్ అంబాసిడర్ల ద్వారా సేకరించారు. కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ సీహెచ్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. అలాగే మండల పరిధిలోని చిట్టూర్పు, కొడాలి గ్రామ పంచాయతీల్లోనూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు ఎస్.శ్రీలక్ష్మి కృష్ణవేణి, నాగమణి, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోలాహలంగా పోతురాజుస్వామి జాతర



ఆలయం ఎదుట భక్తుల నైవేద్యాలు స్వీకరిస్తున్న రజక పూజారులు

నాగాయలంక: గ్రామంలోని బోసుబొమ్మ సర్కిల్‌లో కొలువై ఉన్న శ్రీపోతురాజుస్వామి వార్షిక జాతర మహోత్సవం, గుడి సంబరం ఆదివారం కోలాహలంగా జరిగింది. పోతురాజుకు నైవేద్యాలు, మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. పల్నాటి ఆచారవంతుల పర్యవేక్షణలో జాతర సాంప్రదాయాలకు అనుగుణంగా రజక పూజారులు ప్రత్యేక పూజలు చేసి చద్ది నైవేద్యాలు స్వీకరించారు. తొలుత ఆనవాయితీ ప్రకారం గ్రామంలోని పల్లయ్యగారి ముఠా నైవేద్యాల సమర్పణతో జాతరకు శ్రీకారం చుట్టారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, ఉపసర్పంచి తలశిల వెంకట నరసింహారావు(నాని), శ్రీరామపాదక్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు తదితర ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమాలను నిర్వాహక కమిటీ ప్రతినిధులు తలశిల బాలకృష్ణ, ఉప్పల లీలాకృష్ణ ప్రసాద్(బుజ్జి), గడ్డిపాటి ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

మెగా అపూర్వ కలయిక



సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు

ఒక చోట చేరిన 92 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు



నిర్వాహకులు శివరామకృష్ణ, శేషగిరిలకు సన్మానం చేస్తున్న పూర్వ విద్యార్థులు

చల్లపల్లి: చల్లపల్లిలోని శ్రీమంతురాజా యార్లగడ్డ శివరామప్రసాద్(ఎస్ఆర్‌వైఎస్‌పీ) జూనియర్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల మెగా అపూర్వ కలయిక కార్యక్రమం జరిగింది. పాఠశాల ప్రారంభించిన 1932 నుంచి 2024 వరకు మొత్తం 92 ఏళ్లల్లో చదివిన 92 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులకు ప్రవాస భారతీయులు మండల శేషగిరి, రిటైర్డ్ ఆర్డీవో నాదేళ్ల శివరామకృష్ణల ఆధ్వర్యంలో ఈ అపూర్వ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 1,100 మందికి పైగా కార్యక్రమానికి హాజరయ్యారు. దీంతో కళాశాల ప్రాంగణమంతా సందడి వాతావరణం నెలకొంది. ఎవరికి వారు తమ క్లాస్‌మేట్స్ ఎక్కడ ఉన్నారా.. అంటూ వెతుక్కుంటూ వెళ్లి ఆప్యాయంగా ఆలింగనాలు చేసుకున్నారు. కుశల ప్రశ్నలు వేసుకుంటూ గుంపులు గుంపులుగా ఒకచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. పాఠాలు చెప్పిన తమ గురువుల వద్ద ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఎస్ఆర్‌వైఎస్‌పీ హైస్కూల్, జూనియర్ కళాశాల వ్యవస్థాపకుడు శ్రీమంతు రాజా యార్లగడ్డ శివరామప్రసాద్ బహదూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. యోగా గురువులు నాగరాజు, శేషప్రసన్న, శ్రీనివాలసరావుల విద్యార్థులు వేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన పలు పోటీలు నిర్వహించి విజేతలకు మెమెంటోలు అందజేశారు.

2027లో మరలా కలుద్దా..

నిర్వాహకులు నాదేళ్ల శివరామకృష్ణ, మండల శేషగిరిలు మాట్లాడుతూ తక్కువ సమయంలో ఊహించని విధంగా పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో ఇక్కడికి రావడం ఆనందంగా ఉందన్నారు. ఇక ముందు ఇలాంటి కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తామని తెలిపారు. తదుపరి పూర్వ విద్యార్థుల కలయిక 2027లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఇంత చక్కని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు శివరామకృష్ణ, శేషగిరిలను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

మనసు గంతులేస్తోంది



బహుశా ఇక్కడికి వచ్చిన వారిలో నేనే సీనియర్‌ని. పాఠశాల ప్రారంభించినప్పుడు పుట్టా. 1948లో హైస్కూల్ విద్యను పూర్తిచేశా. నాకు 92 ఏళ్లు. శరీరం సహకరించడంలేదుగానీ నా మనస్సు మాత్రం ఇక్కడి జ్ఞాపకాల్లో పరుగులు తీస్తోంది.

–బొందలపాటి వెంకటేశ్వరరావు, 1948 బ్యాచ్

ఆనాటి రోజులు గుర్తొచ్చాయి



నేను మచిలీపట్నంలో ఉంటున్నా. నడవడానికి శరీరం సహకరించదు. కుటుంబ సభ్యుల సహకారంతో ఇక్కడి వచ్చా. స్నేహితులను కలుసుకుని మాట్లాడుతుంటే నాడు అందరం కలిసి ఆటల్లో పరుగులు తీసిన రోజులు గుర్తొస్తున్నాయి. చాలా సంతోషంగా ఉంది.

–హుస్సేన్ ఘోరీ, 1980 బ్యాచ్